క్లుప్తంగా

ప్రతి పంటకు ఈకేవైసీ తప్పనిసరి

కలకడ : మండలంలోని ప్రతి రైతు సాగు చేసిన పంటకు ఆర్‌బీకేల సిబ్బంది తప్పనిసరిగా ఈక్రాప్ బుకింగ్‌తో పాటు, ఈకేవైసీ (వేలిముద్రలు) తప్పనిసరిగా చేయించాలని మండల ఆర్‌బీకే చైర్మన్ చింతకుంట హరినాథరెడ్డి ఆదేశించారు. సోమవారం మండలంలోని కోన రైతు భరోసా కేంద్రంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ప్రతి రైతు మంగళవారంలోపు నమోదు చేసుకోవాలని, 7న తుదిజాబితా ప్రకటిస్తామని తెలిపారు. పంట నమోదు ద్వార రైతులు పండించిన పంటను అధిక ధరలకు విక్రయించడానికి, తరలించడానికి ప్రభుత్వం సాకర్యం కల్పిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీకే ఇన్‌చార్జి హారూన్‌బాష, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, భాస్కర్ రెడ్డి, వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

తీరిన తాగునీటి సమస్య

తంబళ్లపల్లె : మండలంలోని ఎగువసుగాలి తాండలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ తులసమ్మ, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే జీజేఎం నిధులతో తాగునీటి సమస్య తీర్చాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశోక్ రూ.1.35 లక్షలతో బోరు, మోటారు ఏర్పాటు చేశారు. గ్రామస్తులు సర్పంచ్, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

పెద్దమండ్యం : మండలంలోని బురుజుకురవపల్లె ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనాన్ని సోమవారం ఎంపీడీఓ సి. వెంకటరమణయ్య తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల హాజరుపై ఆరా తీశారు. మెను ప్రకారం భోజనం అందుతోందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో పిల్లలతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రాథమిక స్థాయిలో విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడు బి. శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శి జనార్దన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు 25 శాతం ఉచిత ప్రవేశం

రామసముద్రం : విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25శాతం ఉచిత ప్రవేశాలు ఇవ్వాలని ఎంపీడీఓ నారాయణస్వామి, ఎంఈఓ హేమలత తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ అవకాశాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 ఆంజనేయులు, డీటీఈఓ అన్వేష్, సీఆర్‌పీలు దామోదర్, సుధాకర్‌రెడ్డి, హరి, నాగరాజ, రామాంజులు, అనిత, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి



ప్రచారం చేస్తున్న ఎంపీపీ శ్రీదేవి తదితరులు

కలకడ : సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించాలని ఎంపీపీ శ్రీదేవి, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు వెంకటమణరెడ్డి కోరారు. సోమవారం సాయంత్రం మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ కొత్తగాండ్లపల్లెలో ఇంటింటి ప్రచారం చేశారు. రాజంపేట ఎంపీగా మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యేగా చింతల రామచంద్రారెడ్డిని గెలిపించాలని కోరారు. మోసపూరిత ఇతర పార్టీల హామీలు నమ్మకుండ మాటకు కట్టుబడే నాయకుడు, హామీలు అమలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నమ్మాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జయప్రకాష్, ఉదయ్‌భాస్కర్, జీపుల కృష్ణ, రమణ, రవికుమార్, వెంకటరమణ, రాజన్న, శ్రీనివాసులు, భాస్కర్, రెడ్డెప్ప, జగన్‌మోహన్‌రెడ్డి, భయన్న పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

పీలేరు రూరల్ : ప్రయాణీకులకు ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని డీఎం బి. కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో సుండుపల్లె, సోమల మార్గాల్లోని ప్రయాణీకులకు లక్కీడిప్ ద్వారా బహుమతులు అందజేశారు. పీలేరు, సుండుపల్లె మార్గంలో మొదటి బహుమతి శ్రీ సాయి ప్రసన్న, ద్వితీయ బహుమతి భాస్కర్, తృతీయ బహుమతి ఎస్. సుధాకర్‌కు లభించాయి. సోమల-కలకడ మార్గంలో మొదటి బహుమతి జమృద్దీన్, ద్వితీయ బహుమతి రెడ్డి ప్రభాకర్, తృతీయ బహుమతి కె. గౌతమికి మౌర్య కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దేవులపల్లె మౌర్యరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ సుబ్బమ్మ, బస్టేషన్ మేనేజర్ రెడ్డెప్ప పాల్గొన్నారు.

పల్స్ పోలియో 99.83 శాతం

కలకడ : మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలో 99.83 చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశామని ఎర్రకోటపల్లె పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులకు సోమవారం వేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యం పీహెచ్ఈఓ జయరామయ్య, పీహెచ్ఎన్ సుబ్బరత్నమ్మ, వెంకటేశ్వరనాయుడు, జమీల్‌బాష, రమణమ్మ, శివకుమార్ పాల్గొన్నారు.

జగనన్న పాలన అభివృద్ధికి చిరునామా

- కళ్లుండి చూడలేని టీడీపీ నాయకులు
- కార్యకర్తలు పార్టీకి పట్టుకొమ్మలు వారి కష్టాన్ని విస్మరించం
- పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



తరిగొండలో సచివాలయ భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి తదితరులు

గుర్రంకొండ : సీఎం జగనన్న పాలన అభివృద్ధికి చిరునామా అని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ప్రశంసించారు. రాష్ట్రంలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందని అన్నారు. సోమవారం మండలంలోని టి.రాచపల్లె, తరిగొండ గ్రామాల్లో రూ. 2 కోట్లతో నూతనంగా నిర్మించిన సచివాలయ, ఆర్బీకే, విలేజ్ క్లీనిక్ భవనాలకు ఆయన ప్రారంభోత్సవం నిర్వహించారు. గుర్రంకొండ, తరిగొండ గ్రామాల్లో వేర్వురుగా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో కోట్లాది రుపాయలు వెచ్చించి ప్రభుత్వ భవనాలను నిర్మించడం హర్షనీయమన్నారు. పాలనను ప్రజల వద్దకే తెచ్చి సీఎం దేశచరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. ప్రతిపక్షాల విమర్శలకు జవాబు కావాలంటే గ్రామాలకు వచ్చి నూతనంగా నిర్మించిన భవనాలను చూడాలన్నారు. టీడీపీ వాళ్లు కళ్లుండి చూడలేని స్థితిలో ఉన్నారని ఎద్దేవాచేశారు. రాబోయే ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారిని గుర్తించి తగిన ప్రాధాన్యత ఇస్తామని భరోసా ఇచ్చారు. నాయకులు, కార్యకర్తలు పార్టీకి పట్టుకొమ్మలాంటివారని, వారి కష్టాన్ని ఎన్నడూ విస్మరించమని హామీ ఇచ్చారు. ఎల్లవేళ లా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సఫ్రీన్ ముక్తియార్, మండల ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నక్కా చంద్రశేఖర్, మండల సచివాలయల కన్వీనర్ నాగేంద్ర, మండల ప్రత్యేక ఆహ్వానితులు కందుల గుణశేఖర్, అప్పల్ల, ఎల్వీ రమణ, తరిగొండ ప్రకాష్‌రెడ్డి వైస్ ఎంపీపీ కరుణాకర్, సింగిల్‌విండో డైరెక్టర్లు నీళ్ల శ్రీనివాసులు, రెడ్డికుమార్, మాజీ ఎంపీపీ జమీర్, సర్పంచ్‌లు విశ్వనాథ్, యల్లారెడ్డి, జగన్మోహన్, ఎంపీటీసీలు సరస్వతి, రాజగోపాల్, రామ్‌ప్రకాష్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

అమీన్ పీర్‌కు ఎమ్మెల్యే నివాళి

వాల్మీకిపురం : మండలంలోని పునుగుపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త అమీన్ పీర్ గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పునుగుపల్లిలో సోమవారం అమీన్‌పీర్ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే చింతల వెంట చింతల ఆనందరెడ్డి, నీళ్ల భాస్కర్, శ్రీధర్ రాయల్, కేశవరెడ్డి, అబ్దుల్ కలీమ్, కువైట్ శంకర తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలు అభివృద్ధికి ప్రతిరూపాలు

కేవీపల్లె : ప్రభుత్వ భవనాలు అభివృద్ధికి ప్రతిరూపాలుగా నిలిచాయని ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తువ్వపల్లెలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం భవనం, గాలివారిపల్లెలో ఆర్‌ఓ ప్లాంట్, రైతు భరోసా కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గ్రామంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ తీసుకొచ్చారని తెలిపారు. తువ్వపల్లె పంచాయతీలో ప్రభుత్వం సంక్షేమ పథకాలు ద్వారా సుమారు రూ.11 కోట్లు లబ్దిదారుల ఖాతాల్లో జమచేయడం జరిగిందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై ఎంతో మంది ఇతర పార్టీల నుంచి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని రామచంద్రారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీలేరు, కేవీపల్లె మండలాల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ గజ్జెల శృతి, సర్పంచ్‌లు ఆనంద్‌రెడ్డి, రాంప్రసాద్‌నాయుడు, మాజీ సర్పంచ్ ఆనంద్‌రెడ్డి, నాయకులు గజ్జెల శ్రీనురెడ్డి, టి. సాహిత్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, కడప గిరిధర్‌రెడ్డి, రామస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

మదనపల్లె సిటీ : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్. రామలింగారెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం కాలేజీ ఎన్‌ఎస్ఎస్ విద్యార్థులు ఒంటిమిట్టపల్లెలో ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో ఓటు ఎంతో విలువైనదని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని కోరారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అరుణ్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు మంజు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీలేరు బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

పీలేరు : పీలేరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం స్థానిక కోర్టు ఆవరణలో నూతన కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బి.సి. పురుషోత్తం రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎ.నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆర్.చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీ పి. నాగభూషణం, ట్రెజరర్‌గా శేషాద్రి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా నిరంజన్ కుమార్, లైబ్రరీ సెక్రటరీగా పూజారి యల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మిథున్‌రెడ్డి, రామచంద్రారెడ్డి హ్యాట్రిక్ ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి

పీలేరు : సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హ్యాట్రిక్ ఖాయమని పీలేరు, కేవీపల్లె మండలాల వైఎస్సార్‌సీపీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం స్థానిక ఇందిరమ్మ కాలనీలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీకి రూ.30 లక్షలతో సమ్మర్‌స్టోరేజ్ నుంచి పైపులైన్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారంతో పాటు మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పక్షాల మాయమాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఎంపీ, ఎమ్మెల్యేను గెలిపించి జగనన్నను రెండోసారి ముఖ్యమంత్రిని చేస్తే పీలేరును మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ రమేష్‌రెడ్డి, సర్పంచ్ చంద్రారెడ్డి, ఎంపీటీసీ అమరనాథరెడ్డి, నాయకులు కడప గిరిధర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, ఉదయ్, ఆనంద్, భువనరెడ్డి, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు బందోబస్తు



వాహనాల పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి

తంబళ్లపల్లె : మహాశివరాత్రి సందర్భంగా మల్లయ్యకొండపై కొలువైన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్ తెలిపారు. సోమవారం వారు మల్లయ్యకొండను సందర్శించారు. ఆలయ కమిటీ చైర్మన్ మల్‌రెడ్డి, ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి, పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జున వారికి స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలతో స్వామిదర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సీఐ మధు, ఎస్ఐ శివకుమార్‌కు సూచించారు. కొండకింద వాహనాల పార్కింగ్, ఆర్టీసీ బస్సుల స్టాపింగ్ స్థలాలను పరిశీలించారు.

జాబ్ మేళాలో 139 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో నిర్వాహకులు

పీలేరు రూరల్ : స్థానిక ప్రభుత్వ సంజయ్‌గాంధీ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 139 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో డిగ్రీ, పీజీ అర్హత కల్గిన అభ్యర్థులు సుమారు 400 మంది హాజరైనట్లు తెలిపారు. పేటీఎం, బిగ్‌సీ, ముత్తూట్ ఫైనాన్స్, అపోలో ఫార్మసీ, యంగ్ ఇండియా, టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 139 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ. 18,500 వేతనం అందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ రాజశేఖర్, జి. కృష్ణమూర్తి, డాక్టర్ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



సమస్యలు తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ మనూజారెడ్డి

మదనపల్లె : పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి తెలిపారు. సోమవారం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ ప్రమీలతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ముజీబ్ నగర్‌కు చెందిన ముస్లిం మహిళలు, మార్చి 12 నుంచి పవిత్ర రంజాన్‌మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉపవాసదీక్షలు, ఇతర అవసరాలకు నీటిఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. అలాగే బీకే.పల్లె గ్రామంలో వేసిన జగనన్న లేఅవుట్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో లేఅవుట్ సమస్యలపై ఫిర్యాదుచేస్తే.. 15 రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన అధికారులు ఇప్పటివరకు పరిష్కరించలేదని వాపోయారు. కార్యక్రమంలో ఆర్వో నాగేశ్వరరావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి స్థలాలకు అడ్డుతగలడమా?

కలికిరి : బాధితులకు అండగా నిలిస్తే టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కిశోర్‌రెడ్డి ఓర్వలేక పోతున్నారని ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నిర్వాసితుల ఇంటి స్థలాలను అడ్డుకోవడం ఆయన పెత్తందారీ తనానికి నిదర్శనమని విమర్శించారు. రైతులను దగా చేసిన చరిత్ర టీడీపీదేనని మండిపడ్డారు. ఎంపీ, ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంటే చూసి ఓర్వలేక పోతున్నారని విమర్శించారు. మండలంలోని కలికిరి గ్రామ పంచాయతీ నగ్రావాండ్లపల్లికి చెందిన రైతులు కలికిరి-మదనపల్లి రోడ్డు ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాలకు భూములిచ్చారు. గత టీడీపీ ప్రభుత్వం రైతులకు నామమాత్రంగా నష్టపరిహారమిచ్చి చేతులు దులుపుకుంది. పరిహారం పెంచాలని కొందరు రైతులు కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. అయితే తమకు మదనపల్లి-తిరుపతి జాతీయ రహదారి సమీపంలో ఇంటి స్థలాలు కేటాయించి ఆదుకోవాలని రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డిని బాధితులు కోరారు. స్పందించిన వారు రైతులు కోరిన స్థలంలో ఇంటి పట్టాలు మంజూరుకు చర్యలు తీసుకుంటామని ఇటీవల హామీ ఇచ్చారు. ఈ మేరకు రైతులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో భూమి చదును పనులు ప్రారంభించారు. సమాచారం తెలుసుకున్న కిశోర్‌రెడ్డి, టీడీపీ నేతలు హుటాహుటిన అక్కడికి చేరుకుని హడావిడి చేశారు.

వృద్ధ దంపతులకు అండగా ఉంటాం

మదనపల్లె సిటీ : కన్న కొడుకు చేతిలో తీవ్రంగా గాయపడిన వృద్ధ దంపతులకు అండగా నిలుస్తామని ఏపీ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎస్. మునిగోపాలకృష్ణ తెలిపారు. సోమవారం జిల్లా ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్న దంపతులు వెంకటరమణారెడ్డి, లక్ష్మమ్మను పరామర్శించారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు జగన్‌మోహన్, రమణ, శ్రీనివాసులు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం

- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి
- ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికిన ప్రజలు



దేవల్‌చెరువులో ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

ములకలచెరువు : రాష్ట్ర అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎమ్మెల్యే మండలంలోని పర్తికోట, దేవల్‌చెరువు పంచాయతీల్లో పర్యటించారు. పర్యటనలో ఎమ్మెల్యేకు ప్రజలు అడుగడుగునా ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే జగనన్న పాలనలో జరిగిన అభివృద్ధి, అర్హులకు మంజూరవుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు. అర్హులై పథకాలు రాకుంటే తన దృష్టికి తీసుకురావాలని తక్షణమే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. పర్తికోట నుంచి దుసానివారిపల్లి వరకు బీటీ రోడ్డు, పర్తికోటలో సీసీ రోడ్లు మంజూరు చేయాలని గ్రామస్తులు ద్వారకనాథ్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రజల కోసం అహర్నిశలు తపన పడుతున్న జగనన్న పాలన మళ్లీ వచ్చేందుకు ప్రతి ఒక్కరూ శక్తి వంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సాయిలీల, జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు మనోహరమ్మ, ప్రభావతమ్మ, ఎంపీటీసీ నరసింహులు నాయుడు, నాయకులు చక్రపాణి, కేశవరెడ్డి, టంగుటూరి శ్రీనివాసులు, విశ్వనాథ్, రెడ్డిశేఖర్, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డితో పాటు అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

పర్తికోట బీసీ కాలనీకి చెందిన పలు కుటుంబాలు ద్వారకనాథ్‌రెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. జగనన్న పాలనలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరామని బీసీ నాయకులు పూజారి శేఖర్ వెంకటరమణ, శ్రీనివాసులు, పుష్పలత, కృష్ణమ్మ, లక్ష్మిదేవి, చౌడమ్మ తదితరులు పేర్కొన్నారు. అదేవిధంగా పెద్దతిప్పసముద్రం మండలంలోని టి.సదుం పంచాయతీలోని పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, ఉప సర్పంచ్ పీఎస్ మధు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిశారు. వైఎస్సార్‌సీపీలో చేరేందుకు తాము సిద్ధంగా ఉన్నామంటూ వారు ఎమ్మెల్యేకు వివరించారు.

ఫ్రీజర్ బాక్స్ వితరణ

కేవీపల్లె : మండలంలోని ఎంవీపల్లె గ్రామ పంచాయతీకి అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫ్రీజర్ బాక్స్ వితరణ చేసినట్లు సర్పంచ్ రత్నాకర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఫ్రీజర్ బాక్స్ వితరణ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఈశ్వరయ్య, నాయకులు రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిమ్మనపల్లె : మండల పరిధిలోని రెడ్డివారిపల్లె ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్)లో ఆరవ తరగతిలో ప్రవేశానికై దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఈ ఏడాది ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఏపీఎంఎస్.జీఓవి.ఇన్. వెబ్‌సైట్‌లో లేదా ఆదర్శ పాఠశాల కార్యాలయంలో ఈ నెల 31వ తేదీ లోపు ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో జతపరిచి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 దరఖాస్తు రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నెంబర్లు 9490730673, 9966524446, 9391493392లో సంప్రదించాలని సూచించారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల సత్తా

మదనపల్లె సిటీ : కరాటే పోటీల్లో స్థానిక కేశవరెడ్డి పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో 16 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో తనుష్‌మోక్షరెడ్డి, మోహిత్‌రెడ్డి, యోగానంద, ఉదయకిరణ్, భార్గవ్, శశాంక్, సాయిప్రశాంత్, ఆదిల్, లక్షిత్, అరవింద్‌లు ఓపెన్ కటా గ్రాండ్ ఛాపియన్‌లో పాల్గొని 7 బంగారు, 5 రజిత, 4 క్యాంస పతకాలు సాధించారు. వీరిని కాటే మాస్టర్ సదా శివ, పాఠశాల సిబ్బంది అభినందించారు.

శేషవాహనంపై ఊరేగిన సిద్ధేశ్వరస్వామి

కలకడ : మహాశిరాత్రి బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకూ కలకడ పురవీధులలో శ్రీకామాక్షిసమేత సిద్ధేశ్వరస్వామి శేష వాహనంపై ఊరేగారు. ఆలయ ధర్మకర్త కేసర్ల అఖిలేష్ ఆధ్వర్యంలో శెట్టి కులస్తులు ప్రత్యేకంగా అలంకరించిన శేషవాహనంపై స్వామి వారు ఇంటింటి పూజలు అదుకున్నారు. ఈకార్యక్రమంలో అనేక మందిభక్తులు పాల్గొన్నారు.

కొత్త తేరుకు అనుమతి లేదు

రామసముద్రం : మండలంలోని ఆర్. నడింపల్లె పంచాయతీ బల్లసముద్రం కొండపై వెలసిన శ్రీవాలీశ్వరస్వామి రథోత్సవానికి పాత తేరునే వినియోగించాలని సోమవారం హైకోర్టు తీర్పు ఇచ్చినట్లు జెడ్పీటీసీ సీహెచ్ రామచంద్రారెడ్డి తెలిపారు. వాలీశ్వరస్వామి కొండపై మహాశివరాత్రి సందర్భంగా వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈ ఏడాది ఉత్సవాలకు కొత్త తేరును రథోత్సవానికి వినియోగించాలని బల్లసముద్రం గ్రామానికి చెందిన పలువురు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. న్యాయస్థానంలో జెడ్పీటీసీ స్వయంగా వాదించారు. ప్రజల కోరిక మేరకు గతంలో వినియోగిస్తున్న పాత తేరునే ఉత్సవాల్లో వినియోగించాలని న్యాయస్థానం వెల్లడించినట్లు ఆయన తెలిపారు.

కార్యకర్తలు పార్టీకి పట్టుకొమ్మలు

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్




సమావేశంలో నిస్సార్ అహమ్మద్, నరేష్‌కుమార్‌రెడ్డి

రామసముద్రం : పార్టీకి కార్యకర్తలు పట్టుకొమ్మలని మదనపల్లె వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ కొనియాడారు. సోమవారం మినికిలోని గోకుల్ కల్యాణ మండపంలో మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్‌రెడ్డితో కలిసి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ పంచాయతీల వారీగా ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల నాయకులు, వలంటీర్లు, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్ తట్టి శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ కుసుమకుమారి, సింగిల్‌విండో ప్రెసిడెంట్ కేశవరెడ్డి, వైస్ ఎంపీపీలు రమణారెడ్డి, గంగాధర్‌నాయుడు, కన్వీనర్ నందకిషోర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, జయరామిరెడ్డి, గెవన్న, దొడ్డిపల్లి ఆనంద, గోపినాథరెడ్డి, సుజ్ఞానమూర్తి, తిమ్మారెడ్డి, ఉదయ్‌శంకర్ రెడ్డి, రెడ్డెప్ప, సుబ్రమణ్యం, గబ్బురు బాబు, మస్తాన్, తపాల మస్తాన్, మహబూబ్‌బాషా, బాబారాధారెడ్డి, ప్రకాష్, రమణ, బాలప్ప, ఆదినారాయణ, షంషీర్, నాగరాజ, రెడ్డెప్పనాయుడు, రవి, రెడ్డివీరేగౌడు, సర్దార్, రెడ్డెప్ప, కృష్ణప్ప, భాస్కర్, శివ, దొరబాబు, రాజన్న, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మండల కన్వీనర్‌గా సీహెచ్ ప్రకాష్

సచివాలయాల మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్‌గా సీహెచ్ ప్రకాష్‌ను నియమిస్తున్నట్లు ఆ పార్టీ మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ ప్రకటించారు. ఈ మేరకు సోమవారం సీహెచ్ ప్రకాష్‌ను ఎంపీపీ కుసుమకుమారి, సింగిల్‌విండో అధ్యక్షుడు కేశవరెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, మండల కన్వీనర్ నందకిషోర్‌రెడ్డి, రాధారెడ్డి, భాస్కర్, నారాయణస్వామి అభినందించారు. సీహెచ్ ప్రకాష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన పదవికి న్యాయం చేస్తానని తెలిపారు. ఆయనకు ప్రజా ప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ వలంటీర్లు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

పీలేరు రూరల్ : మండలంలోని యర్రగుంట్లపల్లె పంచాయతీ ఎస్టీ కాలనీ తదితర గ్రామాల నుంచి సుమారు 30 కుటుంబాలు టీ డీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. సోమవారం సాయంత్రం పీలేరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పీలేరు, కేవీపల్లె మండలాల పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో పృథ్వీరాజ్, మురళీ, పురుషోత్తంరాజు, జనార్దన్‌రాజు, చిరంజీవి, ఆంజనేయులు, వెంకటరమణరాజు, ఉత్తన్న, దేవేంద్రనాయక్, కృష్ణమూర్తి ఉన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్రారెడ్డి, ఎంపీటీసీ అమరనాథరెడ్డి, ఉప సర్పంచ్ బుల్లెట్ శేఖర్, నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, బాలం నరేంద్రరెడ్డి, సహదేవయ్య తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో క్షయను నిర్మూలిద్దాం

నిమ్మనపల్లె : అవగాహనతో క్షయ వ్యాధిని నిర్మూలిద్దామని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్‌బాబు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని రెడ్డివారిపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులకు వాల్మీకిపురం టీబీ యూనిట్ అధికారులతో కలిసి క్షయవ్యాధి వ్యాప్తి, నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేయకూడదని తెలిపారు. క్షయ వ్యాధి (టీబీ) సోకిన వారిలో అలసట, తలనొప్పి, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, శ్వాసకోశ సమస్యలు వంటి లక్షణాలు కనపడుతాయని తెలిపారు. టీబీని నివారించడానికి డాట్స్ చికిత్స అందుబాటులో ఉందన్నారు.